# పతిప్రాణ

ఊటుకూరు సత్యనారాయణరావు బహద్దరు వారు

అది శరత్కాలము. రాత్రి ప్రథమయామము గడచుచుండెను. సుధాతుందిలములు కౌముదీవీచికలు విశ్వసౌందర్యసందేశము దిశాఫలకములపైని చిత్రించుచుండెను. సమీరబాలుడు గేయములనే చెట్లయాకులలోజేరి సణుగుకొనుచున్నాడు. దక్షిణమునుండి వాయుతరగలలో కొట్టుకొనివచ్చు శ్రీగంధమధురసౌరభము సృష్టియంతయు నావరించినది.

ఇది యంతయు నొక జీర్ణపర్ణకుటీరమునందలి విషాదగాథలో వైవర్ణ్యము జెందినది. సృష్టిసౌందర్యమీదృశ్యమును తిలకించి ముగ్ధమై, దీనమై, కడకు కృత్రిమమైపోయినది. ఒక అమాయికురాలగు నిల్లాలి యంతిమ సాధ్వీత్వప్రదర్శనము జరుగుచుండెను. ఆమె జీవితమంతయు పరమపవిత్రమును, సేవావినమ్రమును జేసుకొన్నది. జీవితాంతమున కామెమిగుల్చుకొన్నది పతిప్రేమయొక్కటియే. భౌతికజీవనవ్యవస్థలో సర్వము నిరాశాహతమైన భాగమే గడచిపోయినది. ప్రేమఫలములని భ్రమించిన మధురసంతానము నశించి దుఃఖమే ప్రసాదించియుండెను. ఆమె అంతిమశ్వాసలు చాలతీవ్రముగ జీవితమును ముగించుచుండెను. అవయవములు మృత్యుబాధాభరమున వక్రీభూతము లగుచుండెను. కన్నులు తేజోవిహీనములై పోయెను. ఆవికృతమృత్యుకల్లోలములో, కుటీరమునంతయు క్రమ్ముకొనిన దీనబాంధవుల ఆక్రందనములో నామెహృదయము ప్రియాన్వేషణము సేయుచుండెను. ఆతనిముఖ మొక్కమారుచూచి, తన హృదయఫలకాంకితుడగు మూర్తితో పోల్చుకొని కన్నులు మూసుకొన దలంచినది. ఇది ప్రకటన మెట్లగును? ప్రేమకు ప్రకటనతో బనిలేదు. దానికి కార్యక్రమములేదు. అది స్వయంప్రకాశితము. ఆదర్శమహితము.

ఆమెహృదయాధిపతి నిర్జీవుడై సమీపించెను. అప్పటికే ఆమె యవకాశములన్నియు ముగిసిపోవుచుండెను. ఆతనికన్నులలో వ్రాసియున్న స్థిరస్థాయికమగు కృతజ్ఞవృత్తము మాత్రము చదువుకొన్నది. అత డామెను జగత్పితారాధనమునకు గద్గదితస్వరముతో ప్రేరేచెను. "నాజీవితసర్వస్వము దేనికొరకంకితముసేయబడినదో అట్టిపతిప్రేమారాధనమే నాకు తరణోపాయము." ఈవాక్యమాతని దేహమును, హృదయమును భేదించుకొనిపోయినది. ఇకేమియు బలుకలేదు. చైతన్యశూన్యమగుచున్న హృదయము, ఆమె ఆత్మశాంతికొరకెత్తినదోయిలి—అత డచలపాషాణమువలె నిలచిపోయినాడు. కవోష్ణమైన అమె వియోగాశ్రువులతో నాతనిదోయిలి ఆర్ద్రమైపోయినది. హతప్రయత్నములైన ఆహస్తములు పతిచరణముల వరకును చాచుకొనలేక తారుచునట్లేయాగిపోయినవి.